క్లుప్తంగా

ఫ్యాన్లు, కుర్చీల వితరణ



నెల్లూరు(బారకాసు) : రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధనలక్ష్మీపురం, వావిలేటిపాడులోని ఆరు అంగన్‌వాడీ స్కూల్స్‌కు ఫ్యాన్లు, పిల్లలకు కుర్చీలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ రెడ్డి ఐక్యవేదిక ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, అందులో భాగంగానే అంగన్‌వాడీ స్కూల్స్‌కు ఫ్యాన్లు, కుర్చీలు అందజేశామన్నారు. సంఘ సభ్యులు ఓబుల్‌రెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపూట బడులకు తూట్లు

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఒంటిపూట తరగతులకు తూట్లు పొడుస్తున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల విద్యార్థులు పాఠశాలల్లో ఇబ్బందులు పడతారని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని కోరారు.

వసతి గృహాలకు వేగంగా మరమ్మతులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లాలోని బీసీ సంక్షేమ శాఖకు చెందిన 32 ప్రభుత్వ వసతి గృహాల్లో మరమ్మతుల పనులు వేగంగా జరుగుతున్నాయని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని వెంకటలక్ష్మమ్మ అన్నారు. నగరంలోని జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల్లో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.78 లక్షలు మంజూరు చేసిందన్నారు. మరమ్మతులను పూర్తి చేసి రానున్న విద్యా సంవత్సరానికి పూర్తి సౌకర్యాలతో వసతులను కల్పిస్తున్నామన్నారు.


రైల్వే ఫ్లాట్‌ఫామ్‌పై వ్యక్తి మృతి



మృతుడు

నెల్లూరు (క్రైమ్) : నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఫ్లాట్‌ఫామ్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఫ్లాట్‌ఫామ్ నంబర్–4పై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, నలుపు రంగు ఫ్యాంట్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి (40) మృతిచెందారు. రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామగ్రికి రక్షణ కల్పించాలి



కళాశాలలో నిరుపయోగం ఉన్న సామగ్రి

నెల్లూరు (టౌన్) : స్థానిక జాతీయ రహదారి సమీపంలోని వేణుగోపాలస్వామి జూనియర్ కళాశాలలో నిరుపయోగం ఉన్న సామగ్రికి రక్షణ కల్పించాలని ఎంఎస్‌డబ్ల్యూ సొసైటీ అధ్యక్షుడు మస్తాన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ఆ కళాశాలలో తరగతుల నిర్వహణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కళాశాల పరిసరాల్లో పహారా కల్పించాలన్నారు.

డిగ్రీ పరీక్షలకు 81 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 81 మంది హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 84 మందికి గానూ 81 మంది హాజరైనట్లు వెల్లడించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఇందుకూరుపేట : మండలంలోని కుడితిపాళెం గ్రామంలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ శాఖ అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. ఈఈ రమేష్ చౌదరి, ఏడీఈ సురేంద్రబాబు, ఏఈ తీర్థంరెడ్డి గ్రామంలో పరిశీలించారు. సుమారు రూ.2.50 కోట్లతో సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అధికారుల మీనమేషాలు ఎందుకు..?

- అవినీతికి పాల్పడ్డారని తెలిసినా చర్యలు ఏవీ
- షోకాజ్ నోటీస్‌తో సరిపెట్టేసిన ఉన్నతాధికారులు

జిల్లా బీసీ సంక్షేమ శాఖలో ఇద్దరు వార్డెన్లు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని నివేదికలు తేల్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 28వ తేదీన షోకాజు నోటీసులు కూడా జారీ చేశారు. అయినా ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



విడవలూరు బీసీ సంక్షేమ హాస్టల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : విడవలూరు, మైపాడు బీసీ సంక్షేమ హాస్టల్స్‌లో ఇద్దరు వార్డెన్లు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. రెండేళ్లుగా సాగుతున్న ఈ తంతుపై ఫిబ్రవరి 23వ తేదీన సాక్షి దినపత్రికలో 'వీరిపై చర్యలు తీసుకోరా..' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వారికి షోకాజు నోటీసులు ఇవ్వమని ఆశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. హడావుడిగా ఆ ఇద్దరు వార్డెన్లకు ఆశాఖ అధికారులు షోకాజు నోటీసులు కూడా ఇచ్చారు. నెలకావస్తున్నా ఆ వార్డెన్ల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. అయితే గురువారం బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఈ విషయంపై ఆరా తీయగా ఇద్దరు వార్డెన్లలో ఒకరు సమాధానం ఇచ్చారని, మరో వార్డన్ ఇవ్వాల్సి ఉందని చెప్పుకొచ్చారు.

ఉన్నతాధికారులకు వాటాలు?

గత రెండేళ్లుగా జరుగుతున్న అవినీతిపై బీసీ సంక్షేమ శాఖాధికారులు ఎటువంటి పర్యవేక్షణ, విచారణ చేయకపోవడం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. కలెక్టర్ ఆదేశించినా వార్డెన్ల దగ్గర నుంచి సమాధానం రాకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. వార్డెన్లు స్వాహా చేసిన సొమ్ముకు సంబంధించి అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ శాఖాధికారులకు వాటాలున్నట్లు వార్డెన్లే చెప్పుకొస్తున్నారు. కలెక్టర్ ఇచ్చిన షోకాజు నోటీసులకు సైతం వార్డెన్లు సమాధానం చెప్పడం లేదంటే ఏ స్థాయిలో ఆశాఖలో అవినీతి ఏరులై పారుతుందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇద్దరు వార్డెన్లలో ఒకరి నుంచి సమాధానం రావాల్సి ఉందని, ఇందుకు సంబంధించిన నివేదిక కలెక్టర్‌కు ఇవ్వాల్సి ఉందని, తదుపరి ఆయన ఇచ్చే ఆదేశాలను పాటిస్తామని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారిణి వెంకలక్ష్మమ్మ చెప్పడం గమనార్హం.

పార్కులను అందుబాటులోకి తేవాలి



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరంలోని పార్కుల్లో వివిధ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ తన పర్యటనలో భాగంగా 40వ డివిజన్ మూలాపేట వాటర్ ట్యాంక్ పార్క్, 42వ డివిజన్ ఖుద్దూస్‌నగర్ పార్క్, అమీన్‌నగర్ పార్క్, 44వ డివిజన్ మహబూబ్ ఖాన్ పార్క్, 48వ డివిజన్ ఏపీజే అబ్దుల్ కలామ్ పార్క్, 47వ డివిజన్ గుప్తా పార్కులను గురువారం సందర్శించారు. అన్ని పార్కుల్లో క్రీడా పరికరాలు, జిమ్ వస్తువులు, చిన్నారులకు ఆటవిడుపు పరికరాలు, వాకింగ్ ట్రాక్, బెంచీలు, పచ్చదనం, మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీటి వసతి, పార్కుల చుట్టూ ప్రహరీ నిర్మాణం, విద్యుద్దీపాలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక కుక్కలగుంట వెహికల్ షెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, డీజిల్ మీటర్ల రీడింగ్, వాహనాల మైలేజీ, వాహనాల మరమ్మతులు తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురాం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో కంటి పరీక్షలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (పొగతోట) : నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు శ్రీవాసన్ ఐ కేర్ వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, ఉద్యోగ సంఘాల నాయకులు లక్కాకుల పెంచలయ్య, కొండయ్య, ఉమాశంకర్, సుబ్రహ్మణ్యం, ముజీర్, బీమ్‌రెడ్డి, రమేష్ బాబు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారుల దౌర్జన్యాలు ఆపాలి



భగత్‌సింగ్ కాలనీలో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం నేతల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో ఇంటి, కుళాయి పన్నుల వసూళ్ల పేరుతో కార్పొరేషన్ అధికారులు ప్రజలపై దౌర్జన్యాలు, వేధింపులకు పాల్పడుతున్నారని సీపీఎం నేతలు ఆరోపించారు. ఈ మేరకు వారు ప్రజలతో కలిసి గురువారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీ మూడు జెండాల సెంటర్ నుంచి స్థానిక సచివాలయం వరకు నిరసన ర్యాలీ చేశారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ, జలజీవన్ మిషన్ పేరుతో ఇంటింటికీ ఉచితంగా తాగునీరు అందిస్తామని ప్రధాని మోదీ చెబుతున్నా, నగరంలో మాత్రం ఇంటి, కుళాయి పన్నులను వసూలు చేసేందుకు 166 టీమ్‌లను గత రెండు నెలల నుంచి ఏర్పాటు చేసి రోజువారీగా టార్గెట్‌లను అధికారులు విధిస్తున్నట్లు తెలిపారు. పన్నులను చెల్లించకుంటే కరెంట్ కట్ చేస్తామని హెచ్చరిస్తూ, ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి దౌర్జన్యాలు చేయడం సరికాదన్నారు. గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.67లతో తాగునీటి కుళాయి కనెక్షన్ ఇచ్చారని, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చారన్నారు. అయితే నేటి కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిన కారణంగా ఇంటి, కుళాయి పన్నులు, వడ్డీల రూపంలో ప్రజలను దోచుకుని ఖజానా నింపుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నగర కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో రూ.58 కోట్లు వస్తుండగా నేడు కొలతలు మార్చి రూ.150 కోట్లకు పెంచి ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఇంటి, కుళాయి పన్నులపై అధిక వడ్డీని మాఫీ చేయాలని, ఉచితంగా తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఈనెల 25న కార్పొరేషన్ కార్యాలయం వద్ద నగర ప్రజలతో మహాధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సూర్యనారాయణ, బీవీ నరసింహ, మూలం ప్రసాద్, పద్మ, వేణు, జాఫర్, చెంగయ్య, గడ్డం శ్రీనివాసులురెడ్డి, భాగ్యమ్మ, మురళి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ బైండోవర్

నెల్లూరు(క్రైమ్) : రౌడీషీటర్ల కదలికలపై చిన్నబజారు పోలీసులు నిఘా పెంచారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై అబ్దుల్ రజాక్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. గాంధీబొమ్మ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఖుద్దూస్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ జలీల్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేశారు.

22న దుకాణాలకు వేలంపాట

నెల్లూరు (పొగతోట) : నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలో ఉన్న కోనేరు మార్కెట్‌లో 140 దుకాణాలను మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్మించారు. గత నెలలో 71 షాపులకు వేలం నిర్వహించగా, మిగిలిన 69 షాపులకు ఈనెల 22న వేలం పాట నిర్వహించనున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనితాకుమారి గురువారం తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(బృందావనం) : కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో పౌష్టికాహారం పంపిణీతో పాటు, అన్నదానాన్ని గురువారం నిర్వహించారు. ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ ఎం.టైటస్ నిర్మల్‌కుమార్, రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్, ఎ.జయప్రకాష్, క్రాంతి, రూత్‌బినోమి, మరియమ్మ, అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ పాల్గొన్నారు.

'సింహపురి వైభవం'పై ఉపన్యాసం రేపు

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు 'సింహపురి చారిత్రక వైభవం' అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందని నిర్వాహకులు వై.శేషగిరీశం, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. వక్తగా విశాలాక్షి సాహిత్య మాసపత్రిక సంపాదకుడు ఈతకోట సుబ్బారావు వ్యవహరించనున్నారన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని 20 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అందించారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ మేరకు గురువారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎనిమిది నెలల కాలంలో రూరల్ పరిధిలో రూ.70 లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైవీ హనుమారెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



నెల్లూరు(బారకాసు) : వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మరణించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నెల్లూరులో ఉన్న వైవీ సుబ్బారెడ్డి సోదరుడు హనుమారెడ్డిని ఆయన నివాసంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి గురువారం కలిసి పరామర్శించారు. 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, రూరల్ నియోజకవర్గ పబ్లిక్ సిటీ వింగ్ అధ్యక్షుడు వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకు గాయాలు కాకుండా చూసుకోవాలి

నెల్లూరు(అర్బన్) : కారణాలు ఏవైనా తలకు సాధ్యమైనంత వరకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అపోలో ఆస్పత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాంసతీష్ అన్నారు. ప్రపంచ తలగాయాల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని అపోలో ఆస్పత్రిలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఏవీ రమణమూర్తి, న్యూరో సర్జన్ డాక్టర్ వెంకట్‌తో కలిసి మాట్లాడారు. తలకు బలమైన గాయాలు జరిగినప్పుడు వ్యక్తి ప్రాణాలను కాపాడటంలో మొదటి గంట (గోల్డెన్ అవర్)లో చికిత్స అందాల్సి ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రమాదవశాత్తు కిందపడి తలకు గాయం కావడం, భవన శిథిలాల కింద పడటం.. ఇలాంటి సందర్భాల్లో మొదటగా తీవ్ర ప్రభావానికి గురయ్యేది మెదడు మాత్రమేనన్నారు. దీంతో జ్ఞాపకశక్తి కోల్పోవడం, దృష్టిలోపాలు రావడం, తలనొప్పి, మానసిక స్థితిలో మార్పులు రావడం, వాంతులు కావడం లాంటి లక్షణాలు రావచ్చన్నారు. నెల్లూరు అపోలో ఆస్పత్రిలో సిస్టెర్నోస్టమీ అనే అధునాతన మెదడు శస్త్ర చికిత్సను ప్రారంభించామన్నారు. క్రిటికల్ కేర్ విభాగ డాక్టర్ శ్రీనివాస్, న్యూరో సర్జన్ డాక్టర్ ఉబేద్, యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ మంజూరుకు చర్యలు

- కృతజ్ఞతలు తెలిపిన జెడ్పీ చైర్‌పర్సన్



ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం ఇస్తున్న చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (పొగతోట) : చింతారెడ్డిపాళెంలో హైవే వద్ద అండర్‌పాస్ మంజూరు చేస్తామని తెలిపిన కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి, దీనికి కృషిచేసిన తిరుపతి ఎంపీ గురుమూర్తి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, 20 కార్యక్రమాల చైర్మన్ లంకా దినకర్‌లకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. నగరంలోని చింతారెడ్డిపాళెం హైవే వద్ద నిత్యం ట్రాఫిక్ అంతరాయం, ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఎంపీలు గురుమూర్తి, డీకే అరుణలకు జెడ్పీ చైర్‌పర్సన్ తీసుకెళ్లారు. వారు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన కేంద్ర మంత్రి అండర్‌పాస్ బ్రిడ్జి మంజూరు చేస్తామని తెలిపారు.

త్యాగరాజస్వామికి గాన నీరాజనం



'మల్లాది' సోదరుల గాత్ర కచేరి

- అలరించిన మల్లాది సోదరుల గాత్ర కచేరి

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలో 60వ త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం కోదండరామస్వామి అలంకారంలో స్వామివారు భక్తులను కరుణించారు. తొలుత విజయవాడకు చెందిన సంగీత విద్వాంసులు 'మల్లాది' సోదరులు (మల్లాది రామ్ ప్రసాద్, మల్లాది రవికుమార్) గాత్ర కచేరి మధురంగా సాగింది. వారు ఆలపించిన కీర్తనలు అందరినీ అలరించాయి. స్మరణోత్సవాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు చింతా ఈశ్వరశర్మ భాగవతార్ 'భక్తనందనార్' హరికథ, వేమూరి బాలకృష్ణభాగవతార్ 'సతీసక్కుబాయి' హరికథ, బోడిగ లక్ష్మీనారాయణ భాగవతార్ 'సుందరకాండ' హరికథ, స్థానిక కళాకారులచే ఆలపించిన త్యాగరాజ కీర్తనలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను భిక్షాటనా పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి ఎనమంద్ర నాగదేవిప్రసాద్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు సిటీ : నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో స్టాల్స్ నిర్వాహకులకు ప్లాస్టిక్ అనర్థాలపై ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పశువులు, పక్షుల మనుగడకు ఇబ్బంది కలుగుతోందన్నారు. అదేవిధంగా మానవులకు కేన్సర్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ సెక్రటరీ హీనా, డిపో మేనేజర్లు మురళీకృష్ణ, శివకేశవ్‌యాదవ్ పాల్గొన్నారు.

'రంగడి' విహారం

పినాకినీ నదిలో ఉభయదేవేరులతో విహరిస్తున్న తల్పగిరి రంగనాథుడు




- వైభవంగా తల్పగిరి రంగనాథుడి తెప్పోత్సవం
- ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : సింహపురి క్షేత్రపాలకుడైన రంగనాథుడు పవిత్ర పినాకినీ నదిలో విహరించారు. రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేతంగా రంగనాథస్వామి తెప్పోత్సవం గురువారం రాత్రి కనులపండువగా జరిగింది. స్వామివారి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు వచ్చిన అశేష భక్తజనంతో తల్పగిరి రంగనాథస్వామి సన్నిధి, పవిత్ర పినాకినీ తీరం కళకళలాడింది. గోవింద, రంగనాథుడి నామస్మరణతో 'పినాకినీ ఘాట్' పులకించింది. తొలుత అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి పల్లకిపై పెన్నానదిలో అలంకరించిన తెప్ప వద్దకు తీసుకొచ్చారు. తెప్పలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై స్వామివారిని కొలువుదీర్చారు. దీంతో 12 రోజులుగా జరుగుతున్న రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తజనం



శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి